ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 18 మార్చి 2025



సీబీఐకి కాంగ్రెస్ నేత శ్రీనివాస్ హత్యకేసు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోలారు కాంగ్రెస్ నేత, జడ్పీ మాజీ చైర్మన్ ఎం శ్రీనివాస్ హత్యకేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. హోం మంత్రి పరమేశ్వర్, మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్‌లకు ఆప్తుడిగా గుర్తింపు పొందిన ఎం శ్రీనివాస్‌ను 2023 అక్టోబరు 23న శ్రీనివాసపుర శివారు ప్రాంతంలో మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. శ్రీనివాస్ భార్య డాక్టర్ చంద్రకళ ఈ కేసును సీబీఐకు అప్పగించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈమేరకు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి ఎం నాగప్రసన్న సోమవారం ఆదేశించారు.





రెండో విమానాశ్రయం.. కనకపురవైపే..!

● కొలిక్కి వచ్చిన సర్వేలు ● ఏడు ప్రాంతాల్లో పరిశీలన ● నెలమంగలకు నీలినీడలు ● నిర్మాణానికి ఆరేడేళ్లు..

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కీలకమైన అంశంపై ఆరేడు నెలలుగా సాగుతున్న చర్చ కొలిక్కివస్తోంది. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లోనూ బెంగళూరుకు రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అంశంపైనే చర్చ జరిగింది. బెంగళూరుకు రెండో విమానాశ్రయం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేవనహళ్ళిలోని కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏటా తాకిడి పెరుగుతోంది. దేశీయ, అంతర్జాతీయ విమానాల సంఖ్య రెట్టింపు అవుతోంది. ప్రయాణీకులతోపాటు సరుకు రవాణాకు డిమాండ్ వస్తున్నందున ప్రత్యామ్నాయం కోసం రెండో విమానాశ్రయం అవసరమని నిర్ధారించిన విషయం తెలిసిందే. నాలుగైదు నెలలుగా బెంగళూరుకు అనుబంధంగా ఉండే పలు ప్రాంతాల్లో సర్వేలు చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో డ్రోన్‌ల ద్వారా సమీక్షలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడ రెండో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే అంశం ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. నెలమంగల, బిడది ప్రాంతాలు జాబితానుంచి దూరమైనట్లు తెలుస్తోంది. కనకపుర రోడ్డుప్రాంతంవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. బెంగళూరుకు రెండో విమానాశ్రయం అంశంపై ఇండియన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ (ఏఏఏ)కు వినతిని పంపారు. బెంగళూరుకు రెండో విమానాశ్రయం విషయంలో ఆత్రుతకు పలు కారణాలు ఉన్నాయి. తమిళనాడు ప్రభుత్వం హోసూరు సమీపాన ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని నిర్ణయించింది. తమిళనాడు ప్రభుత్వం ఆ దిశగా తీవ్రమైన కసరత్తు చేస్తోంది. ఇదే కారణంతోనే బెంగళూరు శివారు ప్రాంతాల్లో రెండో విమానాశ్రయం కోసం 7 ప్రాంతాలను ఎంపిక చేశారు. ఆ తర్వాత ఐదింటికి తగ్గాయి. ప్రస్తుతం 3 ప్రదేశాలకు సంబంధించి ప్రస్తావనలు ఉన్నట్లు తెలుస్తోంది. బిడది ప్రాంతంలో విమానాశ్రయం ఎంపిక చేస్తే బెంగళూరు, మైసూరు నగరాలకు ప్రాధాన్యం ఉంటుందని భావించారు. నెలమంగల, మాగడి ప్రాంతాలు కూడా ప్రస్తావనలో ఉన్నాయి. బెంగళూరు సిటీకి 60-75 కిలోమీటర్ల దూరం ఉండాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతానికి మూడు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కనకపుర రోడ్డు, హారహళ్ళి, కుణిగల్ - కనకపుర రోడ్డులు ప్రస్తావనలో ఉన్నట్లు భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయపడ్డారు. రెండో విమానాశ్రయాన్ని తుమకూరువైపు తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి సోమణ్ణకు పరమేశ్వర్ ప్రస్తావించారు. నెలమంగలలో ఏర్పాటు చేయాలని భావించినా పలు అడ్డంకులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కనీసం ఏడేళ్లు..

బెంగళూరుకు రెండో విమానాశ్రయం నిర్మించాలనే ప్రయత్నం వెనుక పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త విమానాశ్రయం నిర్మించాలంటే భూసేకరణ, ఆ తర్వాత గ్రాంట్ల విడుదల జరగాల్సి ఉంటుంది. వీటన్నింటికంటే విమానాశ్రయానికి చేరుకునే రోడ్డు మార్గాలు అభివృద్ధి కావాల్సి ఉంటుంది. ఇలా ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కనీసం ఏడెనిమిదేళ్లపాటు అవసరమని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఒప్పందాల ప్రకారం 2033 వరకు దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్‌కు 150 కిలోమీటర్ల దూరంలో ఎటువంటి విమానాశ్రయం ఏర్పాటు చేయరాదనే నిబంధన ఉంది. 2030 నాటికి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ 10 కోట్లమంది ప్రయాణీకుల సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం ఉంది.

బెంగళూరు చుట్టూ విమానాశ్రయాలే...

బెంగళూరుకు అనుబంధంగా రెండో విమానాశ్రయం ఏర్పాటైతే నగరం చుట్టూ విమానాశ్రయాలే ఉంటాయి. ప్రస్తుతం నగర పరిధిలోని హెచ్ఏఎల్ విమానాశ్రయన్నా వీవీఐపీలకోసం, ప్రయోగాలకోసం వినియోగిస్తున్నారు. దేవనహళ్లి వద్ద ఉండే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రధానమైనదిగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హోసూరులో తమిళనాడు ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కసరత్తు సాగిస్తోంది. ఇలా మరో పదేళ్ల తర్వాత నగరం చుట్టూ విమానాశ్రయాలే రానున్నాయి.





కేంద్రం ఇచ్చింది అప్పు మాత్రమే..!

● బీజేపీ నేతలవి అసత్యాలు
● విమర్శించినవారి సలహాలు తీసుకుంటాం
● గవర్నర్ ప్రసంగంపై సీఎం

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పన్నుల వాటా ఇవ్వలేదని, కానీ వడ్డీ రహిత రుణం మాత్రమే ఇచ్చిందని, ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మరో అంశం లేక అబద్ధాలను సభలో ప్రస్తావించారని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. ఏడాది ప్రారంభంలో సంప్రదాయంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలు ముగిసిన మేరకు సీఎం సిద్దరామయ్య సోమవారం వివరణ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగంలో సంప్రదాయంగా ప్రభుత్వ సాధనలను కొనియాడతారన్నారు. ఈ అంశంపై కొందరు విమర్శించారని, కొందరు వాస్తవాలు మాట్లాడారన్నారు. మరికొందరు పనిగట్టుకుని విమర్శలు చేశారని, అందరి సలహాలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 2023 మే 22న అధికారంలోకి వచ్చిందని, ఇది తమ పాలనలో గవర్నర్ చేసిన రెండో ప్రసంగమన్నారు. గవర్నర్ గ్యారెంటీ పథకాలను ప్రశంసించారన్నారు. అధికారం కోసమే అనేలా పరితపించరాదని, ప్రజాసంక్షేమానికి పాలను సద్వినియోగం చేయాలన్నారు. ప్రతిపక్షనేత అశోక్, సునీల్‌కుమార్‌లు 'కరిమణి మాలిక' (నల్లపూసల యజమాని) ఎవరని ప్రశ్నించారని, సీనియర్ సభ్యులు ఇలా మాట్లాడతారని అనుకోలేదన్నారు. కేంద్రప్రభుత్వం కృష్ణ భాగ్య జలనిగమకు రూ.2వేలకోట్లు ఇచ్చిందని, కర్ణాటక నీరావరి నిగమకు రూ.3వేలకోట్లు ఇచ్చిందని, విశ్వేశ్వరయ్య, జలనిగమతోపాటు పథకాలకు రూ.10వేల కోట్లు ప్రకటించిందని, ఇంకా నిధులు రాలేదన్నారు. తమ గ్యారెంటీలకు జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కాయన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలు అమలు చేశాక, బీజేపీ పలు రాష్ట్రాలలో అమలు చేసిందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు సహచరమంత్రులు ఈ ఏడాది జనవరి 3న గ్యారెంటీలపై అధ్యయనం చేశారన్నారు. కేరళ, మహారాష్ట్ర మంత్రులు రాష్ట్రానికి వచ్చి అధ్యయనం చేశారన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, మంత్రి జితేంద్రసింగ్‌ల ప్రశంసిస్తూ కేంద్రానికి నివేదిక ఇచ్చారన్నారు. కానీ మజ్జిగలో రాళ్లు వెతికేలాంటి కుట్రలు స్థానికంగా చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రేరేపితం కాకుండా సకారాత్మకంగా విమర్శలు చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు గ్యారెంటీలు నిలిపివేస్తామని ప్రతిపక్షాలు ప్రచారం చేశాయని, కానీ అమలు జరగడం లేదా అన్నారు. గ్యారెంటీలతో ఖజానా ఖాళీ కాలేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశంలో అధికారంలోకి వచ్చి 11 నెలలు ముగుస్తోందని ఎన్నో పథకాలకు గ్రాంట్లు పెంచలేదన్నారు. రైల్వేశాఖ కేంద్రానిది అయినా రాష్ట్ర ప్రభుత్వం భూమితోపాటు 50శాతం గ్రాంట్లు ఖర్చు చేస్తామన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేయరాదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు మూడుసార్లు వివరించామన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది ఆపరేషన్ కమలతో మాత్రమేనని ప్రజా మద్దతుతో కాదన్నారు. ఆర్ఎస్ఎస్‌ను ఎదిరించేందుకు తాము సిద్ధమన్నారు. తమ పాలనలో రాష్ట్రంలో నేరాలు తగ్గాయన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం : మంత్రి

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా బేలూరు తాలూకా కోగోడు గ్రామంలో ఏనుగు దాడిలో మృతి చెందిన మహిళ కుటుంబానికి రూ.20లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ప్రకటించారు. విధానపరిషత్ కలాపాలలో సోమవారం జేడీఎస్ సభ్యుడు సూరజ్‌రేవణ్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏనుగులు, మానవుల మధ్య సంఘర్షణ ఎంతోకాలంగా ఉందన్నారు. హాసన్‌లో కొవిడ్ అనంతరం నలుగురైదుగురు ఏనుగుల దాడిలో మృతి చెందారన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారం ఇస్తున్నామని, వారి ప్రాణాలను తిరిగి తెచ్చివ్వలేమన్నారు. కాగా హాసన్, కొడగు, చిక్కమగళూరు ప్రాంతాల్లో ఏనుగుల దాడుల సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు.

సమ్మోహన రూపం

● మోహినీ రూపంలో దర్శనమిచ్చిన ఖాద్రీశుడు
● శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న నారసింహుడు

కదిరి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మైమరపించే సోయగాలతో, చంకన అమృతభాండాగారంతో మోహన రూపుడైన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని నారసింహుడు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాలలో నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యా సమయంలో మోహినీ అలంకారాన్ని గావించారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని రోజుల్లోనూ శ్రీవారు తిరువీధుల్లో మాత్రమే విహరిస్తారు. అయితే మోహినీ ఉత్సవం రోజు కోరిన భక్తుడి ఇంటికి వెళ్లి దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఆలయం నుంచి బయలుదేరిన శ్రీవారు తిరిగి ఆలయప్రవేశం గావించేది మంగళవారం మధ్యాహ్ననికే. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీలక్ష్మీనారసింహుడు మంగళవారం ప్రజా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్యపూజ , హోమం అనంతరం గ్రామ సేవ నిర్వహిస్తారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేమంటే బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఓమారు గరుడ సేవను నిర్వహించినా మళ్లీ ప్రజల కోరిక మేరకు గరుడ సేవను నిర్వహిస్తారు. అందుకే దీన్ని ప్రజా గరుడ సేవ అని పిలుస్తారు.


తిప్పేరుద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా తిప్పేరుద్రస్వామి రథోత్సవం

బళ్లారిరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : చిత్రదుర్గ జిల్లా చెళ్లకెర తాలుకాలో ప్రసిద్ధి చెందిన గురు తిప్పేరుద్రస్వామి దొడ్డ రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డోలు, భజంత్రీ వాయిద్యాలు, పల్లకి, కుంభ కలశ, మినీ, నందికోళ్ల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. మంగళ హారతి, పురవంతర నృత్యం పూర్తి కాగానే తిప్పేరుద్రస్వామికి జై అంటూ నినాదాలు చేస్తూ భక్తులు రథాన్ని లాగారు. అరటిపండ్లు, నాణేలను రథం పైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు రథానికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. హరిదూ బంద్ నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు కైకర్‌పూర్‌కు కానుకలు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కాలినడకన తరలివచ్చారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీపై పోరాడాలి

● యూత్ కాంగ్రెస్ పదాధికారులకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పిలుపు


యూత్‌కాంగ్రెస్ పదాధికారులకు బాధ్యత అప్పగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ముగిశాయని, గెలిచినవారు ఓడినవారు కలసికట్టుగా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని బూత్‌స్థాయి నుంచి బీజేపీ, జేడీఎస్‌లపై పోరాటం చేయాలని డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ప్యాలెస్ మైదానంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మంజునాథగౌడ ప్రమాణస్వీకారం జరిగింది. తాజా మాజీ అధ్యక్షుడు మహ్మద్ నల్‌పాడ్ నుంచి పార్టీ జెండా స్వీకరించడం ద్వారా బాధ్యతలు చేపట్టినట్లయ్యింది. డీసీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 25లక్షలమంది యూత్ కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్నారని ప్రస్తుతం 15-20వేలమంది మాత్రమే వచ్చారని, మిగిలినవారంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. తాలూకాస్థాయి నుంచే అందరూ సమైక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాను విద్యార్థి నాయకుడిగా పీయూసీ ఎన్నికల్లో గెలిచానని, అయితే డిగ్రీ చదివేటప్పుడు ఓడిపోయానని, అప్పటినుంచే తన గెలుపు ప్రారంభమైందన్నారు. క్రమశిక్షణ ముఖ్యమని, మీకు మీరే నిబంధనలు ఉల్లంఘించరాదని తీర్మానించుకోవాలన్నారు. పోస్టర్‌లు, బ్యానర్‌లు వేస్తే నాయకులు కాలేరని, సిద్ధాంతాలతో ముందుకు వెళ్లాలన్నారు. బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేసేవారే నిజమైన నాయకుడన్నారు. రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మహిళలు, యువతకు అండగా ఉంటానని హామీ ఇచ్చానని, అందుకు తగ్గట్టుగానే గృహలక్ష్మి, గృహజ్యోతి, యువనిధి, శక్తి గ్యారెంటీ పథకాలు తీసుకొచ్చామన్నారు. 2028లో మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేయాలన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మంజునాథగౌడ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మర్రివృక్షం లాంటిదని, యువత నడుం బిగిస్తే పార్టీని మరింత శక్తివంతం చేయవచ్చునన్నారు. యువతీ యువకులు తన గెలుపుకోసం కృషి చేశారని, వారందరికీ ధన్యవాదాలన్నారు. మతతత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. మంత్రులు సంతోష్‌లాడ్, దినేష్ గుండూరావ్, లక్ష్మీ హెబ్బాళ్కర్, కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యేలు రిజ్వాన్ అర్షద్, ప్రసాద్ అబ్బయ్య, అశోక్‌కుమార్ రై, రాజేగౌడ, మహంతేశ్ కౌజలగి, ఎస్ రవి, నాగరాజ్ యాదవ్, బసనగౌడ బాదర్లి, జాతీయ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయబాను చిబ్‌తోపాటు మాజీ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, కేపీసీసీ కార్యాధ్యక్షుడు వినయ్ కులకర్ణి, ప్రచార సమితి అధ్యక్షుడు వినయ్‌కుమార్ సొరకెతోపాటు పలువురు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.47 (మంగళవారం సాయంత్రం)
సెహరీ : 5.13 (బుధవారం ఉదయం)

టైర్ 2 బాండ్లతో
నిధుల సేకరణకు కెనరాబ్యాంకు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ కెనరాబ్యాంకు టైర్-2 బాండ్ల ద్వారా రూ.4వేలకోట్లను సేకరించే లక్ష్యానికి ప్రతిపాదించింది. బాండ్లకు క్రిసిల్, కేర్ ద్వారా ట్రిపుల్ ఏ రేటింగ్ ఉంది. బాండ్లకు పదేళ్ల గడువుతో ఐదేళ్ల కాల్ ఆప్షన్ ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లు నిధులను పెంచుకునేలా బాసెల్-3 విధానంలో అడిషినల్ టైర్ 1బాండ్ల రూపంలో రూ.4వేల కోట్లు, టైర్ 2 బాండ్ల రూపంలో రూ.4,500 సేకరించేందుకు ఆమోదం తెలిపారు. బ్యాంకు ఇప్పటికే టైర్1 బాండ్ల రూపంలో 2024 ఆగస్టు నాటికి రూ.3వేలకోట్లు సేకరించింది. కాగా టైర్-2 బాండ్ల కోసం బిడ్డింగ్‌ను సోమవారం చేపట్టారు. ఎన్ఎస్ఈ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్లాట్‌ఫాం (ఈబీపీ) విధానంలో బిడ్‌లకు అవకాశం కల్పించారు.

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can

దుస్తులు ఉతికేందుకు వెళ్లి... ముగ్గురి మృతి

● ఒకరిని కాపాడబోయి మరొకరు చెరువులో మునక
● ఇద్దరు మహిళలు, యువతి దుర్మరణం

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ యువతి సహా ముగ్గురు నీటిపాలైన సంఘటన దావణగెరె జిల్లా లక్ష్మీసాగర గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దీపారాణి (27), దివ్య(24), చందన(18) మృతి చెందారు. చందన, దివ్య స్వయానా అక్కచెల్లెళ్లు. దీపారాణి పొరుగింటి నివాసి. దీపారాణి, దివ్యలకు వివాహమైంది. హోలీ పండుగ నేపథ్యంలో దివ్య పుట్టింటికి వచ్చింది. గత ఏడాది చెరువులో పూడిక తీయకపోవడంతో పాచి ఎక్కువగా ఉంది. బట్టలు ఉతికేవేళ జారిజారిపడి చందన లోతుకు వెళ్లింది. ఆమె కేకలు వేయడంతో రక్షించేందుకు దీపారాణి, దివ్యలు ప్రయత్నించారు. అయితే వారు కూడా చెరువులో మునిగి బయటకు రాలేక చివరకు ప్రాణాలు కోల్పోయారు. కొద్దిసేపటి తర్వాత చెరువు వద్ద వెళ్తున్న స్థానికులు బట్టలు మాత్రమే తేలియాడుతుండడాన్ని గుర్తించి అనుమానంతో అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముగ్గురి మృతదేహాలను అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని తహశీల్దార్ నాగరాజ్ ఇతర అధికారులు పరిశీలించారు. ముగ్గురి మృతితో కుటుంబసభ్యుల ఆక్రందన స్థానికులను కలచివేసింది.

కళాశాల..!

కణేకల్లు వెనుకబడిన ప్రాంతం. పేదలు, కూలీలు అధికంగా నివాసం ఉంటున్నారు. పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థోమత చాలామందికి లేదు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. కణేకల్లులో జూనియర్ కళాశాల ఉండడంతో పంపుతున్నారు. ఆ పైచదువులకు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ చదవాలంటే రాయదుర్గమో, ఉరవకొండో వెళ్లాల్సి వస్తోంది. రోజూ పిల్లలను కళాశాలకు పంపడం తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతోంది. దీంతో చదువు మధ్యలోనే మాన్పించేస్తున్నారు. విద్యార్థినుల పరిస్థితి చెప్పక్కర్లేదు. చాలామంది ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే.. తాము చదువుకోగలమని విద్యార్థులు ఏళ్లుగా కోరుతున్నారు. డిగ్రీ కళాశాల వారి దశాబ్దాల కల. అందుకోసం ఈ ప్రాంతవాసులు ఉద్యమాలు కూడా చేపట్టారు. దశాబ్దాల కల సాకారం కాబోతోంది. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానన్న ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారు. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే కళాశాల నిర్మాణానికి ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక భవనాల్లో వచ్చే విద్యా సంవత్సరమే డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

- ఆంధ్రజ్యోతి, కణేకల్లు

43 ఏళ్ల కల..

కణేకల్లులో 1982లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు పైచదువులకు రాయదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దూర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ చదివే స్థోమత లేక చాలామంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసేవారు. దీంతో 43 ఏళ్లుగా డిగ్రీ కళాశాల కోసం ఇక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

హామీ ఇచ్చారు.. నెరవేరుస్తున్నారు..

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కణేకల్లుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు స్థానికులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అందుకు ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటవడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.



700 మంది విద్యార్థులకు ఉపయోగం

కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు దాదాపు 700 మంది విద్యార్థులకు ఉపయోగకరం. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో చదివే విద్యార్థులకు ప్రయోజనకరం. ఇప్పటికే కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 250 మంది, బొమ్మనహాళ్‌లో 230 మంది, కణేకల్లు మోడల్ స్కూల్‌లో 38 మంది, కేజీబీవీలో 30 మంది చదువుతున్నారు. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉండడంతో వీరంతా కణేకల్లులో డిగ్రీ కాలేజీ నిర్మిస్తే అందులో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

బాలికల్లో ఉత్సాహం

కణేకల్లులో వచ్చే విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాల ప్రారంభం అవుతుందని తెలియడంతో బాలికల్లో ఉత్తేజం నెలకొంది. కణేకల్లులో ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత అనేకమంది గ్రామీణ విద్యార్థినులు డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాల్సి వచ్చేది. ఆయా గ్రామాల నుంచి విద్యార్థినులు కణేకల్లుకు చేరుకుని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలి. దీంతో చాలా మంది విద్యార్థినులు చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా రోజూ తమ పిల్లలను 60 కి.మీ. దూరం పంపాల్సి వస్తుండడంతో ఆసక్తి చూపేవారు కాదు. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ప్రారంభవుతున్న నేపథ్యంలో బాలికల్లో డిగ్రీపై ఆశలు పెరిగాయి.

విద్యాభివృద్ధికి పెద్దపీట

వెనుకబడిన ప్రాంతమైన రాయదుర్గం నియోజకవర్గంలో విద్యతోనే అభివృద్ధి సాధ్యం. కావున నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అందులో భాగంలో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏళ్లగా ప్రయత్నాలు చేస్తున్నాం. అది నేటికి సాకారం అయింది. వచ్చే ఏడాది నుంచే విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది.

-కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్





ఉన్నత చదువులకు అవకాశం

నేను రోజూ స్వగ్రామం బ్రహ్మసముద్రం నుంచి కణేకల్లుకు 10 కి.మీ. దూరం వచ్చి ఇంటర్ చదువుతున్నా. డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాలి. రోజూ స్వగ్రామం నుంచి కణేకల్లుకు వచ్చి, ఇక్కడి నుంచి మరలా ఆ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందే. డిగ్రీ అసాధ్యమనుకున్నా. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడంతో ఉన్నత చదువులపై ఆశలు రేగాయి.

-వహీదా, ఇంటర్ విద్యార్థిని, బ్రహ్మసముద్రం

మంచి అవకాశం



కణేకల్లులో అనేక మంది పేద, మధ్యతరగతి బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్ పూర్తికాగానే చదువులు సందిగ్ధంలో పడేవి. ప్రస్తుతం డిగ్రీ కళాశాల ఏర్పాటవుతుండడం బాలికలకు మంచి అవకాశంగా భావిస్తున్నాం.

-వర్షిత, ఇంటర్ విద్యార్థిని, బెణెకల్లు



శుభ సూచకం..

కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడం శుభ సూచకం. మా కాలేజీలో దాదాపు 552 మంది ఇంటర్ చదువుతున్నారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఏటా పలువురు విద్యార్థులు ఇంటర్ పూర్తి కాగానే చదువు మానేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఇంటర్ విద్యార్థులంతా చేరే అవకాశం ఉంది. ఉన్నత చదువులతో వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

- ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కణేకల్లు

యథేచ్ఛగా జలచౌర్యం

- పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న బీటీపీ
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు



బీటీపీ కాలువ నుంచి పైపుల ద్వారా జలచౌర్యం

గుమ్మఘట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సరఫరాపై అధికారుల నిఘా, నియంత్రణ లేకపోవడంతో ముందు భాగంలో ఉన్న కొందరు రైతులు అనధికారికంగా వాడుకుంటూ జలచౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గుమ్మఘట్ట మండలంలోని భైరవాన్ తిప్ప ప్రాజెక్టు (బీటీపీ)కు గత ఏడాది వర్షాలకు పూర్తిగా వర్షపునీరు చేరింది. దీంతో కుడి, ఎడమ కాలువల కింద 4,800 ఎకరాలకు సాగునీటిని అందించారు. ఆయకట్టులో వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఎడమ కాలువ కింద 14వ డిస్ట్రిబ్యూటరీ నుంచి చివరి ఆయకట్టు దాకా 3,800 ఎకరాలు, కుడి కాలువ కింద చివరి ఆయకట్టుకు రెండు వేల ఎకరాల దాకా సాగునీరు విడుదల చేయడంతో పంటలు సాగుచేశారు. ముందు భాగంలో రైతులు సాగునీటిని అనధికారికంగా వాడుకుంటుండడంతో చివరి ఆయకట్టులో అధికారికంగా సాగుచేసిన రైతులకు సాగు ప్రశ్నార్థకమవుతోంది. రోజురోజుకు వేసవి ఎండలతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటి పోతోంది. గతంలో ఇరిగేషన్ అధికారులు డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఆయకట్టుకు కావాల్సినంత నీటిని మాత్రమే విడుదల చేస్తూ ఎప్పటికపుడు పర్యవేక్షించేవారు. మూడునెలలుగా వారి పర్యవేక్షణ కొరవడింది. దీంతో కొంతమంది రైతులు ఎడమ కాలువలో అక్రమంగా పైపులు వేసి 30 దాకా మోటార్ల ద్వారా కాలువ నీటిని జలచౌర్యం చేస్తున్నారు. నియంత్రించాల్సిన ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కొంతమంది ఇష్టారాజ్యంగా సాగునీటిని వృథాగా హగరికి వదులుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు ఆయకట్టు పంట సాగుచేస్తున్న రైతుల పంటలకు సాగునీరు సరిపడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఆయకట్టు రైతులకు నాలుగునెలలు సాగునీరు అందించాలి. నీరు చేరడంలో ఆలస్యం కావడంతో పంటల సాగు జాప్యమవుతోంది. మరో రెండు నెలలు సాగునీరు ఇస్తే తప్ప పంట చేతికందడం కష్టం. వేసవి ఎండలతో అడుగంటడంతో ఉన్న నీటిని రైతులకు అందించడం కష్టతరంగా మారుతున్నట్లు సాగునీటి సంఘం సభ్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటిని పొదుపుగా వాడుకోకపోతే ఇబ్బందులు తప్పవంటున్నారు. కొంతమంది రైతులు జలచౌర్యానికి పాల్పడుతూ అనధికారికంగా దాదాపు 200 ఎకరాలలో వరిపంట సాగుచేశారు. బీటీపీ నుంచి గుమ్మఘట్ట కేవీ ట్యాంక్ వరకు సాగునీటిని అక్రమంగా వాడుకుంటున్నా పట్టించుకునే వారు లేరు.



గుమ్మఘట్ట వద్ద అనధికారికంగా సాగుచేసిన వరిపంట

జలచౌర్యాన్ని అరికట్టాలి



గ్రామాల ప్రజలు, ప్రధాన కాలువలో కొంతమంది రైతులు పైపుల ద్వారా జలచౌర్యం చేస్తున్నారు. అధికారులు అరికట్టి ఆయకట్టు రైతులను కాపాడాలి. గతంలో ఇరిగేషన్ అధికారులు కాలువగట్లపై తిరుగుతూ నీటిని పొదుపుగా అందించేవారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీరు ఇష్టారాజ్యంగా అక్రమ వాడకం జరుగుతోంది.

-గంగప్ప, ఆయకట్టు రైతు, కలుగోడు

చెరువుకు నీరు వదలండి



కలుగోడు ఎడమ కాలువ పరిధిలోని కలుగోడుచెరువు నీరులేక అడుగంటి పోయింది. ఈ చెరువు పరిధిలో మూడు గ్రామాలు తాగునీటి పథకాల బోరుబావులు అడుగంటి పోతున్నాయి. వేసవిలో తాగునీటి కోసం చెరువును బీటీపీ నీటితో నింపాలి. గతంలో పాలకులు చెరువును నీటితో నింపుతామని హామీ ఇచ్చి విస్మరించారు.

- రామాంజనేయులు, సీపీఐ నాయకుడు



ఆయకట్టును కాపాడుతాం



బీటీపీ కింద సాగు చేసుకున్న పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందిస్తాం. గతంలో లస్కర్లు ఉండడంతో సాగునీరు వృథా కాకుండా కాపాడేవాళ్లం. ప్రస్తుతం పై భాగంలో కొంతమంది రాత్రివేళల్లో జలచౌర్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా గ్రామాల్లో వారిని హెచ్చరించాం. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ లోపంతో కొంతనీరు వృథాగా పోతున్న మాట వాస్తవమే. ఆయకట్టుకు పంటలు నష్టపోకుండా కాపాడుతాం.

- కాలవ నాగరాజు, బీటీపీ సాగునీటి సంఘం చైర్మన్

అధికారి తీరుతో హడల్..!

- సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగలాల్సిందే...
- ప్రజాసమస్యలపై కొర్రీలు... భయపడిపోతున్న సిబ్బంది
- కళ్యాణదుర్గంలోని ఓ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు



కళ్యాణదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకమైన ఆ అధికారి తీరుతో అటు సిబ్బంది, ఇటు జనం హడలెత్తిపోతున్నారు. ప్రతి పనికీ కొర్రీలు వేస్తూ.. తిప్పుకుంటుండడంతో జనం బేజారవుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఆ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగిలిపోవాల్సిందేనని.. ఆయన తీరుపై కిందిస్థాయి సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక సిబ్బంది నలిగిపోతున్నారు. దీంతో కీలకమైన ఆ శాఖలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆ అధికారి ప్రతి సమస్యకు ఏదో ఒక సాకు చెబుతూ పనులు చేయకుండా వాయిదాలు వేస్తున్నారు. ఆయన నిర్వాకం వల్ల ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధులు కూడా ఆ అధికారి తీరుపై మండిపడుతున్నారు. ఆ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క పనీ ముందుకు సాగలేదు. గత కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి. సిబ్బంది కూడా ఆ అధికారికి ఈ పని ఉంది పూర్తి చేయాలని చెప్పడానికి భయపడుతున్నారు. సిబ్బందిపై నిత్యం చిందులు వేస్తుండడంతో వారు భయపడిపోతున్నారు. ఆ అధికారిని పలకరించే సాహసం కూడా చేయలేకపోతున్నారు. కొంతమంది సిబ్బంది మౌనంగా తమ విధులు నిర్వహించుకుంటూ వెళ్లిపోతున్నారు. ఆ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడుతుండడంతో కిందిస్థాయి సిబ్బంది నెలనెలా జీతం తీసుకున్నామా...విధులు నిర్వహించామా...వెళ్లామా అన్న రీతిలోనే కొనసాగుతున్నారు. దీంతో ఆ శాఖ వ్యవస్థ మూలనపడిపోయింది. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ శాఖ పరిధిలో పనులన్నీ సాఫీగా సాగిపోయేవి. కానీ ప్రస్తుతం ముఖ్యమైన అధికారి తీరుతో పనులన్నీ పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఆ అధికారి తీరుతో ఆ శాఖ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఐదేళ్ల నుంచి వేచి చూసినప్పటికీ ఏ మాత్రం ప్రయోజనం లేదని.. ఇప్పుడు కూడా తమ పనులు కావడం లేదని అధికార పార్టీ నాయకులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల మౌనమెందుకో..?

కీలకమైన అధికారి తీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా మౌనం వహించడం విమర్శలకు దారితీస్తోంది. పరిస్థితిని సమీక్షించకుండా, గాడినపెట్టకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాలన ఎలా ఉంది, ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయా లేదా అన్న విషయాలను కూడా తెలుసుకోవడంలో ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పుడంతా కంప్యూటర్ పాలన సాగుతోంది. ఆ శాఖ ప్రగతిని తెలుసుకునే వెసులుబాటు ఉంది. కానీ, ఉన్నతాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

పీడియాట్రిక్ సర్జన్ వార్డు ప్రారంభం

అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చిన్నపిల్లల శస్త్ర చికిత్స వార్డును జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు సోమవారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి సోమ, బుధవారాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పీడియాట్రిక్ ఓపీ సేవలు ఉంటాయని తెలిపారు. చిన్నారులకు ఇక్కడే సర్జరీలు చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్య కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా భక్తవత్సలం, కార్యదర్శిగా శివశంకర్

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో, ఎస్కేయూ అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా భక్తవత్సలం, ఉపాధ్యక్షుడిగా కేబీ చౌదరి, కార్యదర్శిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, వనజ, బసయ్య, రామును ఎన్నుకున్నారు. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను సకాలంలో నిర్వహించకపోవడంతో గతంలో అడ్మిషన్ల శాతం పూర్తిగా పడిపోయిందని నూతన అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. కళాశాలల ఫీజులు తగ్గింపు, తల్లుల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్, ల్యాబ్‌ల నిర్వహణ, ఆలస్యంగా ఫలితాలు విడుదల, క్రీడల నిర్వహణ ఇలా అనేక అంశాలతో కళాశాలలు మూసివేతదశకు చేరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో సకాలంలో ప్రవేశాలు కల్పించేలా ప్రభుత్వం చొరవచూపుతోందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకే చెల్లించి, విద్యార్థులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని అన్నారు.



నూతన కార్యవర్గం

అలా.. బిల్లులు.. ఇలా.. చెల్లింపులు..

చంద్రబాబు పాలనలో ఎప్పటికప్పుడు డైట్ బిల్లుల విడుదల.. ప్రతినెలా వేతనాలు... వార్డెన్లు, అధికారుల హర్షం



భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు (ఫైల్)



కొత్త ప్రభుత్వం వచ్చాక డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుండడంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు కూడా పెండింగ్ లేకుండా క్లియర్ ఇచ్చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో వార్డెన్లు పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో డైట్ బిల్లులు అందక, జీతాలు పడక ఆర్థిక కష్టాలు భరించారు. వడ్డీలకు అప్పులు తెచ్చి ఓ వైపు కుటుంబాన్ని... మరోవైపు వసతిగృహాల విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వార్డెన్లకు నెలనెలా జీతాలు సమయానికి చెల్లించడంతోపాటు... డైట్ బిల్లులను సకాలంలో విడుదల చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. డిసెంబరు నెల వరకూ బిల్లులను క్లియర్ చేసింది. దీంతో సంక్షేమశాఖల అధికారులతోపాటు... వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

టోటల్ క్లియర్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. తొలుత ఆయా వసతిగృహాలకు ఆగస్టు నుంచి బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.13 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన బిల్లులను మంజూరు చేసింది. ఆ తర్వాత అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులను విడుదల చేసింది. దీంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు ఆనందంలో మునిగి తేలుతున్నారు. గత వైసీపీ హయాంలో ఆరేడు నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండేవనీ, విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు అప్పులు చేసేవాళ్లమని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి రెండు నెలలకు మించి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం లేదని చెబుతున్నారు. ఒకవేళ పెండింగ్ పెట్టినా.. అన్నీ ఒకేసారి క్లియర్ చేస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ ఉంది... త్వరలోనే క్లియర్ అవుతాయి



గతేడాది డిసెంబరు పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు క్లియర్ చేశాం. ప్రస్తుతం జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బిల్లుల ప్రతిపాదనలు పంపాం. బడ్జెట్ కూడా ఉంది. ట్రెజరీలోకూడా బిల్లులు పాసయ్యాయి. త్వరలోనే బిల్లులు పడుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

ప్రతిపాదనలు పంపాం...

జిల్లాలోని ప్రీమెట్రిక్ వసతగృహాలకు గతేడాది డిసెంబరు వరకూ బిల్లులు క్లియర్ అయ్యాయి. పోస్ట్‌మెట్రిక్ సంబంధించి సెప్టెంబరు వరకూ విడుదలయ్యాయ్యాయి. పెండింగ్ బిల్లులకు సంబందించిన ప్రతిపాదనలు అడిగారు. ఇప్పటికే ఆ ప్రతిపాదనలు పంపాం. వారంలోపు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

-కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

అక్కితం (జయంతి)



ప్రముఖ మళయాళ కవి, రచయిత, 'పద్మశ్రీ' గ్రహీత అక్కితం అచ్యుతన్ నంబూద్రి 1926 మార్చి 18న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా కుమర నెల్లూర్‌లో జన్మించారు. సరళ మైన, స్పష్టమైన రచనాశైలికి పేరొందారు. అత్యున్నత సాహితీ గౌరవమైన జ్ఞానపీఠ పురస్కారంతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, ఒడక్కుజల్ అవార్డు, వల్లతోల్ అవార్డు, వయలార్ అవార్డు, ఓఎన్‌వీ లిటరరీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 2020 అక్టోబరు 15న కన్నుమూశారు.

దండమూడి రామమోహనరావు (జయంతి)



దండమూడి రామమోహనరావు 1933 మార్చి 18న కృష్ణా జిల్లా ఉయ్యూరులో జన్మించారు. మృదంగ విద్వాంసులుగా పేరొందారు. ఆరో యేటనే కచేరీలో మృదంగం వాయించి ప్రశంసలు పొందారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా పనిచేశారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో కళాకారుడిగా ఐదు దశాబ్దాలపాటు కొనసాగారు. భార్య సుమతిని మృదంగ కళాకారిణిగా తీర్చారు. ఎంతోమంది శిష్యులకు కళను నేర్పించారు. సంగీత నాటక అకాడమీ అవార్డుతోపాటు పలు పురస్కారాలు పొందారు. 2011 జనవరి 11న కన్నుమూశారు.

శశికపూర్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత శశికపూర్ 1938 మార్చి 18న కోల్కత్తాలో జన్మించారు. అసలు పేరు బల్‌బీర్ రాజ్‌కపూర్. ప్రముఖ హిందీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ మూడో కుమారుడు. తండ్రితో కలసి నాటకాలు, సినిమాలలో నటించారు. క్రమేణా నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. సోలో హీరోగా పలు సినిమాలలో నటించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్, నాలుగు నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్సు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2017 డిసెంబరు 4న కన్నుమూశారు.

అరుంధతి భట్టాచార్య (పుట్టినరోజు)



అరుంధతి భట్టాచార్య 1956 మార్చి 18న కోల్కత్తాలో జన్మించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ఖ్యాతి గడించారు. 2016లో ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో శక్తివంతురాలైన తొలి 25మంది మహిళల్లో ఒకరుగా నిలిచారు. 36ఏళ్ల కెరీర్‌లో బ్యాంకింగ్‌కు సంబంధించి విదేశీ వ్యవహారాలు, ట్రెజరీ, రిటైల్ ఆపరేషన్స్, మానవ వనరులు తదితర విభాగాలలో పనిచేశారు. 2018లో 'బిజినెస్ లీడర్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచారు. 2022లో ఆటోబయోగ్రఫీని రాశారు. ప్రస్తుతం సేల్స్ ఫోర్స్ ఇండియాకు ఛైర్‌పర్సన్‌గా సీఈఓగా వ్యవహరిస్తున్నారు. 2025 జనవరిలో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు.

అలరించిన నృత్య రూపకం



నృత్యరూపకంలోని సన్నివేశం

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'మహాకాళి' పేరిట ఆధ్యాత్మికత దృక్పథంతో ప్రదర్శించిన నృత్యరూపకం సభికులను అలరించింది. డాక్టర్ అనురాధ తడకమల్ల, వారి శిష్యులు నాయికా పేరిట స్త్రీ ఔన్నత్యాన్ని తెలిపేలా కూచిపూడి నాట్యగురువు వైజయంతికాశి ఉత్సవాన్ని రూపొందించారు. పలువురు కళాకారులు కథక్, కూచిపూడి అంశాలను ప్రదర్శించారు. దేవి భాగవతం ఆధారంగా నాట్యకథను రూపొందించారు. డివిఎస్ శాస్త్రి సంగీతాన్ని సమకూర్చారు.

థర్మల్ విద్యుత్ కేంద్రం తనిఖీకి నిపుణుల కమిటీ

అడయార్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదం జరిగిన తూత్తుక్కుడి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు నిపుణుల కమిటీ వెళ్ళింది. అలాగే, ఈ ప్లాంట్‌లో ముందు జాగ్రత్త చర్యగా నాలుగు అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచారు. రెండు రోజుల క్రితం ఈ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెల్సిందే. ఈ ప్రమాదం కారణంగా చెలరేగిన మంటలను ఆరు జిల్లాల నుంచి 24 అగ్నిమాపక వాహనాలు, సిబ్బందితో ఆర్పివేశారు. ఈ ప్రమాదం వల్ల రూ.వంద కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు, నష్టం అంచనాకు నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించగా, ఈ కమిటీ ప్లాంట్‌ను పరిశీలించింది. అలాగే, తమిళనాడు విద్యుత్ శాఖ, తమిళనాడు విద్యుత్ బోర్డు ఉన్నతాధికారులు కూడా ప్లాంట్‌ను సందర్శించి, ప్లాంట్‌లో అగ్నిప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

ముగ్గురిపై పోక్సో కేసు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ముగ్గురిపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు, సిద్దు అనే యువకుడు, ఓ బాలిక ప్రేమించుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఆధారంగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సిద్దు ఇంటికి వెళ్లి మందలించారు. ఆ సమయంలో ఇంట్లో లేని సిద్దు, తరువాత మరో ఇద్దరితో కలిసి బాలిక ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. సిద్దుతోపాటు అతనికి సహకరించిన సాయి, వెంకటేశ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

నోటికొచ్చినట్టు మాట్లాడేందుకు...

ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీసు కాదు: మంత్రి ఖర్గే



మంత్రి ప్రియాంకఖర్గే

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నోటికొచ్చినట్టు మాట్లాడేందుకు ఇదేం ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీసుకాదని మంత్రి ప్రియాంకఖర్గే విరుచుకుపడ్డారు. శాసనసభలో సోమవారం మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఎన్నికలలో ఓడించింది కాంగ్రెస్ లేదా సావర్కర్ అనే అంశంపై తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే అరవింద బెల్లద్ మాట్లాడుతూ కేబినెట్ నుంచి తొలగించింది ఎవరని, ఎన్నికలలో ఓడించింది ఎవరని, సమాధికి స్థలం ఇవ్వకుండా చేసింది ఏ పార్టీ అని ప్రశ్నించారు. మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకుని 1952లో అంబేడ్కర్ రాసిన లేఖలో తనను ఓడించింది సావర్కర్ అంటూ రాసుకున్నారని, సదరు లేఖను ప్రదర్శిస్తే రాజీనామా చేస్తారా..? అని సవాల్ విసిరారు. లేఖలో కాంగ్రెస్ పేరు ప్రస్తావించలేదన్నారు. ఈ వివాదం ఇరుపక్షాల మధ్య మరింత వాగ్వాదానికి కారణమైంది. అంబేడ్కర్ రాసిన లేఖను మంత్రి సభలో చదివి వినిపించారు.

నకిలీ ఔషధాల నియంత్రణకు చర్యలు: మంత్రి దినేశ్ గుండూరావ్



మంత్రి దినేశ్ గుండూరావ్

రాష్ట్రంలో నకిలీ ఔషధాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు చేపడతామని వైద్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు ఎస్ రవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. నకిలీ మందులు తయారు చేసిన, విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. 2022-23లో మొత్తం 6 కేసులు, 2023-24లో 10 కేసులు, 2024-25లో 4 కేసులు నమోదయ్యాయని, వెంటనే డ్రగ్ రీకాల్ పాలసీ అమలు చేసి మరింత కఠినచర్యలు చేపడ తామన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు.

కలబురగిలో నిమ్హాన్స్ మాదిరి ఆసుపత్రి: మంత్రి



మంత్రి శరణప్రకాశ్ పాటిల్

కలబురగి జిల్లాలోని మెడికల్ కాలేజీలో నిమ్హాన్స్ మాదిరి ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉద్దేశించిందని వైద్యవిద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అభిప్రాయపడ్డారు. 2025-26 బడ్జెట్‌లోనూ ప్రకటించారన్నారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు తిప్పణ్ణప్ప కమకనూరు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. మైసూరు, కలబురగి జిల్లాల్లో మెడికల్ కళాశాలల్లో నిమ్హాన్స్ మాదిరి సంస్థలను రూ.100కోట్లతో తగిన మానవ వనరులు, సౌలభ్యాలతో ఏర్పాటు చేయదలిచామన్నారు.

సౌరశక్తి కేంద్రాలకు సిద్ధం: మంత్రి జార్జ్

కలబురగి, రాయచూరు జిల్లాల్లో సౌరశక్తి, పవనశక్తి ఉత్పాదనా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్ పేర్కొన్నారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు బసవనగౌడ బాదర్లి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ పవన, సౌరశక్తితోపాటు ఇతరత్రా మూలాలతో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కర్ణాటక ఆధునీకరించిన ఇంధన పాలసీ 2022-27ను అమలు చేయనున్నట్టు తెలిపారు. బిడ్ ద్వారా వ్యక్తిగతంగా లేదా గ్రూపులుగా, ప్రైవేట్ పార్కుల ద్వారా విద్యుత్ పథకాలను పంచుకునేలా ఉద్దేశించామన్నారు.

యూనివర్సిటీల్లో గుణాత్మకత కాపాడతాం

యూనివర్సిటీలలో బోధనా సిబ్బంది భర్తీ చేపట్టడం ద్వారా గుణాత్మకతను కాపాడుతామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొన్నారు. పరిషత్‌లో సభ్యుడు ఎస్‌వీ సంకనూరు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ కర్ణాటక యూనివర్సిటీలో బోధన 416, బోధనేతల 849 పోస్టులు, బెంగళూరు యూనివర్సిటీలో బోధన 234, బోధనేతర 780, మైసూరు యూనివర్సిటీలో బోధన 171, బోధనేతర 268 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. అన్ని పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ మోదం పొందాల్సి ఉందన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరలోనే భర్తీ చేస్తామన్నారు.

పునీత్‌కు ఘన నివాళులు

▸▸ 50వ జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు



పునీత్ సమాధికి నివాళులు అర్పిస్తున్న కుటుంబికులు

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అభిమానులచే 'అప్పు'గా పేరొందిన కర్ణాటక రత్న నటుడు పునీత్‌రాజ్‌కుమార్ 50వ జయంతిని పురస్కరించుకుని బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. పునీత్ సమాధికి సోమవారం భార్య అశ్విని తోపాటు అన్న రాఘవేంద్ర రాజ్‌కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. కాగా పద్మనాభనగర్‌లోని పునీత్‌రాజ్‌కుమార్ గెళెయర బళగ ఆధ్వర్యంలో పునీత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం అన్నదానం నిర్వహించారు. పలు చోట్ల అభిమానులు పునీత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పునీత్ మనమధ్య లేనప్పటికీ ఆయన చూపిన సేవా మార్గంలో కొనసాగుతామని పలువురు అభిప్రాయపడ్డారు. తమగుండెల్లో అజరామరంగా ఉంటారన్నారు. అనంతరం పుస్తకాల పంపిణీ, రక్తదాన శిబిరం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగాయి.

ఆడుగూడిలో ఉత్సాహంగా..

బొమ్మనహళ్ళి: నటుడు పునీత్‌రాజ్‌కుమార్ జయంతిని పురస్కరించుకుని ఆడుగూడిలోని ఓ పాఠశాలలో మాజీ కార్పొరేటర్ మోహన్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. పునీత్ చిత్రపటాన్ని అలంకరించి పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సినీ రంగంలో ఎంతోమంది ఉన్నప్పటికీ సమాజసేవ ద్వారా ఎంతోమంది విద్యార్థులను చదివించిన ఘనత పునీత్‌రాజ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. ఆయన లేనిలోటు బాధాకరమన్నారు. మానవసేవయే మాధవసేవగా ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



పద్మనాభనగర్‌లో అన్నదానం చేస్తున్న మిత్రబృందం



ఆడుగూడిలో పునీత్ చిత్రపటానికి పుష్పాంజలి

కణ్ణూరులో కాటేరమ్మదేవి జాతర



విశేష పూజల్లో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కణ్ణూరు గ్రామంలో కాటేరమ్మదేవి ఆరో వార్షిక జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి నిర్వహించిన విశేష పూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల మంచికోసం అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. జాతరలో ఎటుచూసినా సందడి వాతావరణం నెలకొంది. విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పబంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. జాతరలో కాడు అగ్రహార, బైరతి, బిళిశివాలె, బండె బొమ్మసంద్ర, బైరతి బండె, హోసూరు బండె, రాంపుర, మిట్టగానహళ్ళి తదితర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రముఖులు అశోక్, మారుతి, మహేశ్, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యాభిలాష పెంచడమే లక్ష్యం



కైవార తాతయ్య జయంతిలో కసాప పదాధికారులు

శిడ్లఘట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజలలో సాహిత్యాభిలాష పెంచడమే లక్ష్యమని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పటేల్ నారాయణస్వామి పేర్కొన్నారు. కసాప, వచన సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో కైవార తాతయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నారేయణ తాతయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కైవార తాతయ్య కీర్తనలను ఆలపించిన రిటైర్డు టీచర్ నంజుండప్ప, టీకే వేణుగోపాల్, శంకర్, జీఎన్ నంజుండప్ప, డాక్టర్ డీటీ సత్యనారాయణరావ్‌లను ఆత్మీయంగా సత్కరించారు. కసాప మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ నాగరాజ రావ్, రూపసి రమేశ్, లెక్చరర్ మునిరాజ్ అరికెరె తదితరులు పాల్గొన్నారు.

23న కెంపేగౌడ ఒక్కలిగ సంఘం ప్రారంభం



ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న సంఘం పదాధికారులు

చింతామణి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కెంపేగౌడ ఒక్కలిగ సంఘం ఈనెల 23న తాలూకాలోని బూరగమాకలహళ్ళిలోని సీతారామ కల్యాణమండపంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపల్లి జీఎస్ రాఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటైన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్ళాపురశాఖ మంగళానందనాథస్వామిజీ, ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ విచ్చేయనున్నారని తెలిపారు. ఒక్కలిగ సామాజిక వర్గం రైతులు, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకోసం సంఘం కృషి చేయనుందన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి గోపాల్‌గౌడ, రాష్ట్ర ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు బి కెంచప్పగౌడ, ప్రధాన కార్యదర్శి టి కోనప్పరెడ్డి, గౌరవాధ్యక్షులు యలవహళ్ళి రమేశ్, కిమ్స్ ఆసుపత్రి మాజీ అధ్యక్షులు, డైరెక్టర్ టి రమేశ్, రాష్ట్ర ఒక్కలిగ సంఘం ఉపాధ్యక్షులు రేణుకాప్రసాద్ కేవీ, ఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్య అతిథులుగా దక్షిణ విభాగం డీసీపీ డీ దేవరాజ్, ప్రముఖ న్యాయవాది, కోలారు జిల్లా ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు కేవీ శంకరప్ప, సమాజసేవకుడు రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్సీ తూపల్లి చౌడరెడ్డి తదితరులు విచ్చేయనున్నట్టు తెలిపారు. ఆహ్వానపత్రిక విడుదలలో సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

శుద్ధతాగునీటి కేంద్రం ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే



డీవీజీ చిత్రపటం ఊరేగింపులో ఎమ్మెల్యే తదితరులు

ముళబాగిలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మంకు తిమ్మన కగ్గతో పేరొందిన ప్రముఖ సాహితీవేత్త డీవీ గుండప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు పాఠశాల విద్యార్థులకు అనుకూలంగా రూ.5లక్షలతో శుద్ధతాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలి పారు. పట్టణంలోని డీవీజీ ప్రభుత్వ కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల సభాంగణంలో జిల్లా యంత్రాంగం, జడ్పీ, కన్నడ సంస్కృతిశాఖ, డీవీజీ ఫౌండేషన్, జిల్లా కసాప విభాగం సంయుక్తంగా 138వ జయంతిని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీవీజీ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంకు తిమ్మన కగ్గ సాహిత్యం కన్నడ సాహిత్యంలో ఎంతో పేరొందిందన్నారు. డీవీ గుండప్ప రచనలు ఎంతో అర్థవంతంగా ఉంటాయన్నారు. సరళ జీవనం, స్వాభిమాన జీవనం ఇతరులకు ఆదర్శప్రాయమన్నారు. జిల్లా అధికారి డాక్టర్ ఎంఆర్ రవి మాట్లాడుతూ డీవీజీ రచనలతో వ్యక్తిత్వం, చారిత్రాత్మక నిర్మాణానికి సహకారిగా ఉంటాయన్నారు. ముళబాగిలు ప్రాంతంలో డీవీజీ జన్మించడం మనకు గర్వకారణమన్నారు. డీవీజీ రచనలు ప్రతి ఒక్కరూ చదివి వాటి సారాన్ని అర్థం చేసుకోవాలన్నారు. తహశీల్దారు వీ గీతా మాట్లాడుతూ సాహితీవేత్తగా, పాత్రికేయులుగా, విద్వాంసులుగా మేధావిగా పలు రంగాలలో డీవీజీ పేరొందారన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాలగౌడ, తాజా మాజీ అధ్యక్షుడు జేజీ నాగరాజ్, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ప్రసంగించారు. నగరసభ ఆధ్వర్యంలో డీవీజీ చిత్ర పటాన్ని పురవీధులలో ఊరేగించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ కే సర్వేశ్, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్, కన్నడ సంస్కృతిశాఖ సహాయక డైరెక్టర్ విజయలక్ష్మి, యువజన సేవలశాఖ వెంకటాచలపతి, బీఈఓ రామచంద్ర పలు కన్నడ సంఘాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఇన్‌స్పెక్టర్‌పై దాడి: ఇద్దరి అరెస్టు

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న మహిళా ఇన్‌స్పెక్టర్‌పై ఇష్టం వచ్చినట్టు తిట్టడమేగాక దాడి చేశారనే ఆరోపణల నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగి, అతడి స్నేహితురాలిని మహదేవపుర పోలీసులు అరెస్టు చేశారు. బి.నారాయణపుర నివాసి రాకేశ్‌కుమార్ (35), అతడి స్నేహితురాలు బైసాకి (30)ని అరెస్టు చేశారు. మహదేవపుర ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనితాకుమారి శనివారం రాత్రి సుమారు 12 గంటలకు సింగనహళ్ళి మెట్రో స్టేషన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఆ సందర్భంగా రామమూర్తినగర్ నుంచి సింగనపాళ్యవైపు వెళ్లేందుకు బుల్లెట్‌పై వచ్చిన రాకేశ్‌కుమార్, బైసాకిలను ట్రాఫిక్ సిబ్బంది ఆపారు. రాకేశ్‌కుమార్‌ను పరిశీలించినవేళ మద్యం తాగినట్టు తేలింది. ఈమేరకు బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ లేదా కోర్టులో జరిమానా చెల్లించి రసీదు తెచ్చాక బుల్లెట్ విడుదల చేస్తామని సీఐ అనితాకుమారి తెలిపారు. అయితే ద్విచక్రవాహనాన్ని ఇవ్వాలని రాకేశ్‌కుమార్ కోరగా మద్యం సేవించిన కారణంగా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో బైసాకి ఇష్టం వచ్చినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను తిట్టింది. సుమారు అరగంటపాటు వాగ్వాదం సాగింది. అనుచితంగా ప్రవర్తించి దాడికి పాల్పడినట్టు సమాచారం. దీంతో అక్కడి సిబ్బంది వెంటనే వారిద్దరినీ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా ఇద్దరూ పీకలదాకా మద్యం తాగినట్టు ధ్రువీకరించబడింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన రాకేశ్‌కుమార్ స్థానిక మహదేవపురలోని ఓ ప్రైవేట్‌బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్యాపిల్లలతో బి నారాయణపురలో ఉంటున్నాడు. ఇక అతడి స్నేహితురాలు బైసాకికి కూడా వివాహమైంది. ఆమె కూడా భర్త, పిల్లలతో బి నారాయణపుర ప్రాంతంలోనే ఉంటోంది. శనివారం రాత్రి పార్టీ ఉండడంతో వెళ్లి మద్యం సేవించి బుల్లెట్‌పై వస్తుండగా ఘటన చోటు చేసుకుంది.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు-దంపతులకు గాయాలు

చింతామణి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని ఎంజీ రోడ్డు కోలారు సర్కిల్ సమీపాన ఆగియున్న లారీని వెనుకనుంచి కారు ఢీ కొన్న ఘటనలో దంపతులు గాయపడ్డారు. ఆదివారం రాత్రి 11 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడినవారిని చిక్కబళ్ళాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకా సొణ్ణేనహళ్ళికి చెందిన రాఘవేంద్ర, సౌమ్య దంపతులుగా గుర్తించారు. మంత్రాలయ రాఘవేంద్రస్వామి దర్శనానికి స్నేహితులతో కలసి వెళ్లిన దంపతులు వాపసు వస్తుండగా చింతామణి తాలూకాలోని హెబ్బరి గ్రామంలో వారిని డ్రాప్ చేసి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడినవారిన స్థానికులు ఆటోలో చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు సమాచారం. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోండి



మీడియాతో మేడిహాళ ముని అంజినప్ప తదితరులు


బంగారపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని పలు రైస్ మిల్లులకు పొరుగు రాష్ట్రాలనుంచి బియ్యం అక్రమంగా వస్తోందని అడ్డుకట్ట వేయాలని దమనితర సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడిహాళ మునిఆంజనప్ప సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా లారీ, టెంపోలలో బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన రేషన్ బియ్యం అక్రమంగా వస్తోందని, సదరు బియ్యానికి పాలిష్ చేసి ఎక్కువ రేటుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ఇప్పటికే తాలూకా పౌర ఆహార సరఫరాల శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిం దన్నారు. రాత్రివేళ బియ్యం రవాణాకు అడ్డుకునేందుకు తమకు వాహన సదుపాయం లేదని, తమకు ఎలాంటి సురక్షత లేదని పౌర ఆహార సరఫరాలశాఖ అధికారి చౌడప్ప బదులిచ్చారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సమితి తాలూకా అధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా సంచా లకులు కదిరేనహళ్ళి కుమార్, నగర సంచాలకులు నాగరాజ్, సీనప్ప, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవనామ స్మరణతో మానసిక ప్రశాంతత



రథోత్సవం ప్రారంభంలో నంజావధూత స్వామీజీ తదితరులు

విజయపుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దైవనామ స్మరణతో మానసిక ప్రశాంతత సాధ్యమని ఓం నమఃశివాయ అనే శివపంచాక్షరి మహా మంత్రంలో అన్నింటి సారం ఉందని స్ఫటికపురి గురుగుండ బ్రహ్మేశ్వరి స్వామి సంస్థాన మఠం పీఠాధిపతి నంజావధూత స్వామిజీ అభిప్రాయపడ్డారు. స్థానిక గురప్పన మఠంలోని శివసప్తాహ, ప్రసన్న ఓంకారేశ్వర స్వామి కల్లుగాలి బ్రహ్మ రథోత్సవానికి పూజలు చేసిన అనంతరం స్వామిజీ మాట్లాడారు. దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన ఓంకారేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరగడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక మఠాన్ని కుంబేశపురి ఎలాగో, శిరాలోని గురుగుండ బ్రహ్మేశ్వరి స్వామి మఠాన్ని స్ఫటికపురిగా పిలుస్తారన్నారు. ఈ సందర్భంగా ట్రస్టుకు చెందిన కేశవప్ప, ఎం వీరణ్ణ, వీఎం నాగరాజు, మహేశ్, పురసభ సభ్యుడు సి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.00	1,582.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,911	1.692
నీటి నిల్వ (టీఎంసీలు)	20.26	5.93

తుంగభద్ర నదిలో యువకుడి గల్లంతు



గాలింపు చర్యల్లో స్థానికులు

గంగావతి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా ఏ తాలూకాలోని చిక్కడంకన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బసవేశ్వర క్యాంప్ వద్ద ఆదివారం మహాత్మగాంధీ ఉపాది పనులకు వెళ్తున్న ఒక కార్మికుడు తుంగభద్ర కాలువలో జారీపడి నీటిలో కొట్టుకుపోయాడు. హనుమంతప్ప బసవేశ్వర క్యాంప్ నివాసి. వారం రోజులుగా శిబిరంలో నాలాలో(కాలువ) పూడిక తీసే పనులు జరుగుతున్నాయి. అక్కడ పనిచేసే హనుమంతప్ప ప్రకనే ఉన్న తుంగభద్ర ఎడమ కాలువ వద్దకు వెళ్తుండగా జారిపడి నీటిలో పడిపోయాడు. ఇది గమనించిన యువకులు హనుమంతప్పను కాపాడటానికి ప్రయత్నించారు. అయితే అతను ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహానికి అతను కొట్టుకుపోయాడు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించి తెప్పను ఉపయోగించి గాలింపు చర్యలు ప్రారంభించామని పీడీఓ లక్ష్మణ్ తెలిపారు. దుఃఖిస్తున్న కుటుంబ సభ్యులను తాలూకా పంచాయితీ ఈఓ రాజశేఖర్ హనుమంతప్ప ఓదార్చారు. యువకుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

విద్యార్థులకు వినికిడి పరీక్ష



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బళ్లారి సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బారతీయ రెడ్‌క్రాస్ సంస్థ నగరంలోని ప్రథమదర్శి కాలేజీలో విద్యార్థులకు సోమవారం వినికిడి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్, పెద్దశబ్దం అయ్యే ఉపకరణాలు వాడడం వల్ల వికినిడికి సమస్య ఏర్పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ చౌదరి, రెడ్‌క్రాస్ సంస్థ షకీబ్, జయశ్రీ, పల్లవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులు వినికిడి పరీక్ష చేయించుకున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం: మేయర్

బళ్లారి సిటీ,మార్చి 17(ఆంధ్రజ్యోతి): క్రీడలు కేవలం వినోదానికి పరిమితం కాదని, ఒక వ్యక్తి మానసిక, సాంస్కృతిక వికాసానికి కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రీమతి రుక్మిణమ్మ చెంగారెడ్డి మెమోరియల్ గవర్నమెంట్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, యువజన వ్యవహారాలు ,క్రీడల మంత్రిత్వ శాఖ, లియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతలో క్రమశిక్షణ. నాయకత్వం, సంస్థాగత లక్షణాలు కీలకమైనవి. విద్యతోపాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా వీటిని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. శ్రీమతి గాలి రుక్మిణమ్మ చెంగారెడ్డి మెమోరియల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. నెహ్రూ యువ కేంద్రం యువజన అధికారి మోంటే పత్తార్ విద్యార్థులకు క్రీడల గురించి క్లుప్తంగా సమాచారం ఇచ్చారు. కేవలం క్రికెటే కాకుండా విద్యార్థులు అన్ని క్రీడల్లో ఆసక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వాలీబాల్, ఖోఖో, 100మీ పరుగు పోటీలు, సైక్లింగ్ క్రీడలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.



జ్యోతి వెలిగించి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మేయర్ ముల్లంగి నందీశ్

మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యం

● నారీ-కిల్స్ పథకంతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుస్తాం: జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్

బళ్లారి సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల గురించి సమాచారం అందించడం, వారి జీవనోపాదిని మెరుగుపరచడం, వారు పేదరికం నుంచి బయటపడటానికి సహాయపడటం నారీ-కిల్స్ పథకం లక్ష్యం అని జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారీస్ సుమైర్ అన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత ,జీవనోపాది శాఖ సంజీవిని-కేఎస్ఆర్ఎల్‌పీఎస్ ప్రచారం కింద నారి-కిల్స్ పథకంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు జిల్లాపంచాయతీ జిల్లా వనరుల కేంద్రంలో ఇటీవల నిర్వహిస్తున్న నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నారీ కిల్స్ కార్యక్రమాన్ని మొదటి దశలో జిల్లాలోని 2తాలూకాల్లో అమలు చేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి స్వయం సహాయక బృందానికి చెందిన ఇద్దరు సభ్యులను ఎంపిక చేసి అటువంటి కుటుంబాలను గుర్తించడం (పీఆర్ఏ ఇంటింటి సర్వే) సంబంధిత కార్యకలాపాలను నిర్వహిస్తామని, వారికి 4రోజుల క్షేత్ర సందర్భంలో సహా శిక్షణ ఇస్తామని అన్నారు. అత్యంత పేదరికాన్ని పరిష్కరించడానికి, అత్యంత బలహీన కుటుంబాల సర్వేలను నిర్వహించడానికి , ప్రభుత్వానికి సమాచారం అందించడానికి మహిళా సర్వేయర్లకు సరైన మార్గంలో శిక్షణ ఇస్తే నారి-కిల్స్ ప్రాజెక్టు అమలు ప్రయోజనకంగడా ఉంటుందని ఆయన మహిళా శిక్షణ ఎన్యూమరేటర్లకు చెప్పారు. జిల్లాలోని రెండు తాలూకాలలోని ప్రతి గ్రామ పంచాయితీ నుంచి ఇద్దరు మహిళలకు స్వయం సహాయక బృందాలతో శిక్షణ ఇచ్చామని ఆయన అన్నారు. నారి-కిల్స్ యొక్క డీఆర్‌టీపీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రాజెక్టు యొక్కలక్ష్యాలు,లక్ష్యాల గురించి మాట్లాడారు. ఈసందర్భంలో జడ్పీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్, జెడ్పీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వాగీస్ శివాచార్య, జిల్లా మేనేజర్ విజయకుమార్, నారి-కిల్స్ జిల్లా కోఆర్డినేటర్ వీరన్న, ద్రాక్షాయని తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హారీస్

ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు వదలాలి

● రాష్ట్ర రైతు సంఘం నాయకుల డిమాండ్

కంప్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర జలాశయం నుంచి ఎల్ఎల్‌సీ కాలువకు ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు విడుదల చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసురుసేన జిల్లా అధ్యక్షులు విబిగౌడ డిమాండ్ చేశారు. సోమవారం అతిథి గృహంలో ఏర్పాటు చేసిన రైతు సంఘాల సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పంటలు రైతులకు చేరాలంటే ఏప్రిల్ చివరి వారంలోగా నీరు ఇవ్వాలన్నారు. తుంగభద్ర రైతు సంఘం పురుషోత్తమ గౌడ, ఏప్రిల్ పది వరకు నీళ్లిస్తే సరిపోతుందని అది సరికాదన్నారు. రైతుల పట్ల తమకు ఎలాంటి అవగాహన లేనందునే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు. రైతులు పండించిన పంటల కోసం రాత్రి పగలు ఎదురు చూస్తున్నారు. కానీ రైతులకు మాత్రం చాలా కష్టంగా వుంటుంది. దీంతో లక్షలాది పంటలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కావున దిగువ రైతుల పంటలు పండాలంటే ఏప్రిల్ నెలాఖరులోగా నీరందించాలని కోరారు. ఈ సందర్భంగా తాలుకా అధ్యక్షులు వీరేష్, యూనిట్ అధ్యక్షులు తిమ్మప్ప నాయక, రైతు నాయకులు ఏసీ దానప్ప, కొత్తూరు రమేష్, ఆదోని రంగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీవీ గౌడ

వైభవంగా బలకుందప్ప స్వామి
రథోత్సవం

కంప్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని దేవసముద్రంలో సోమవారంబలకుందప్ప రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయం నుండి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. సమీప గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు సమర్పించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రవి చెళ్లగుర్కిని సత్కరిస్తున్న పునీత్‌రాజ్‌కుమార్ సేవాసమితి సభ్యులు

రక్తదానం మిన్న

బళ్లారి సిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రక్తదానం అంటే ప్రాణదానం అని సామాజిక కార్యకర్త కప్పగల్లు చంద్రశేఖర్ ఆచార్య అన్నారు. సోమవారం బళ్లారిలోని బిగ్ మార్కెట్ సమీపంలో కర్ణాటక రత్న డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ 50వ జయంతి సందర్భంగా అఖిల కర్ణాటక అప్పు యువ సేవా సమితి ,సన్మార్గ ఫ్రెండ్స్ గ్రూప్ సహకారంతో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పునీత్‌రాజ్‌కుమార్ విజయాలు యువతకు , సామాజిక కార్యకర్తలకు, సంస్థలకు, విద్యార్థి సంఘానికి ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. అందుకే ఈ రోజు మనందరికీ స్ఫూర్తిదాయకమైన రోజు అని అన్నారు. కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అతిథిగా పాల్గొని మూడోసారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అప్పు సామాజిక సేవ ఒక ఆదర్శ యుగమని,దానిని మనందరం సాకారం చేసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా మంజునాథ్, రవికుమార్, కుమారస్వామి, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్, మిథున్, లక్ష్మీరెడ్డి, సుజిత్, రామాంజనేయ. వినయ్, కేదార్‌నాథ్, చలపతి, యువత,అప్పు అభిమానులు పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలను జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

'అప్పు'సేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వద్ద పునీత్ రాజ్ జయంతి సందర్భంగా అఖిల కర్ణాటక యువ అప్పుసేన సమితి జేపీ మంజునాథ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హలకుంది రవి కుమార్, సుజిత్, లక్ష్మీకాంత్ రెడ్డి, కప్పగల్ చంద్రశేఖర్ ఆచారి, వేమన్న పాల్గొన్నారు. 36వ వార్డు పార్వతినగర్ సమీపంలో కర్ణాటక రక్షణ వేదిక శివరామగౌడ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ కార్యాలయంలో పునిత్ రాజ్‌కుమార్ 50వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

నాణ్యమైన ధాన్యంతో మద్దతు ధర

● కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పురసభ అధ్యక్షుడు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్

కంప్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన ధాన్యం వరి, మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రానికి సరఫరా చేసి మద్దతు ధర పొందాలని పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బెళగోడుహాళ్ రోడ్డులోని తాలుకా వ్యవసాయోత్పత్తుల విక్రయ సహకార సంఘం గోదాంలో వరి, మొక్కజొన్న నమోదు, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా రైతులు పంటలు సాగు చేసి మద్దతు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కల్పించిన కొనుగోలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారిణి నవ్య మాట్లాడుతూ కంప్లి ప్రాంత రైతుల కోసం పట్టణంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంసీ అధ్యక్షులు హబీబ్ రహమాన్, తాలుకా వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ సహకార సంఘం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు టీ సావిత్రమ్మ, డైరెక్టర్లు ప్రభుస్వామి, జంబన్న, గుబాజి, మంజునాథ, అంజనేయులు, రమేష్, మారేష్, లింగప్ప, విరుపాక్షప్ప, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం గ్రీన్ ఎఫ్‌హోమ్‌మెన, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ విరుపాక్షగౌడ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కారేకల్, తదితరులు పాల్గొన్నారు.

జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంప్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ప్రెసిడెంట్ ఎర్రిస్వామి తెలిపారు. సోమవారం కుడితిని పట్టణంలో సొసైటీ ఆవరణంలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలలో పల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగలింగాచారి, కార్యదర్శి అంజనేయులు, పట్టణవాసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరసభ మాజీ అధ్యక్షురాలు సుశీలమ్మ మృతి

సిరుగుప్ప, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నగరసభ మాజీ అధ్యక్షురాలు వీఎం సుశీలమ్మ(65) ఆకస్మికంగా మృతిచెందారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో ఆమె స్వగృహంలో మృతి చెందడంతో పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు నగరసభమాజీ అధ్యక్షుడు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హోసూరు జోన్



బాలల సంరక్షణ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

బాలల పరిరక్షణకు కట్టుబడ్డాం: కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాలలు, వృద్ధుల పరిరక్షణకు కట్టుబడ్డామని కలెక్టర్ దినేశ్ కుమార్ పేర్కొన్నారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీపుల్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ డే నిర్వహించారు. పించను, ఉచిత కుట్టు మిషన్లు, ఇస్త్రీపెట్టెలు, విద్యుత్ కనెక్షన్‌లు తదితర డిమాండ్లపై ప్రజల నుంచి 232 వినతి పత్రాలు వచ్చాయి. వినతిపత్రాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమం, ప్రత్యేక సేవల విభాగం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం తరపున పిల్లల భద్రతకు భరోసా కల్పిస్తాం అనే అవగాహన బ్యానర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ తరపున 8 మందికి కుట్టు మిషన్లు అందించారు. మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, కుమరన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధనంజయన్, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమాదికారి రమేశ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ ధర్మరాజు, జిల్లా దివ్యాంగుల విద్యాశాఖాధికారి మునిరాజు, జిల్లా ప్రొటెక్షన్ అధికారి శరవణన్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల హత్యపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాలు

హోసూరు మార్చి 17(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో వృద్ధురాలిని, వృద్ధుడిని హతమార్చిన దుండగులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వివరాలిలా. హోసూరు సమీపంలోని ఒనల్‌వాడికి చెందిన లూర్దుస్వామి (70), అతని భార్య థెరెసా దంపతులకు సహాయ రాణి, విక్టోరియా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈక్రమంలో థెరెసా అస్వస్థతకు గురై చెన్నైలో చికిత్స పొందుతోంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న లూర్దుస్వామికి థెరెసా సోదరి ఎలిజబెత్ (65) సహాయంగా ఉంది. ఈనెల 12న సహాయరాణి తన తల్లిని చూసేందుకు చెన్నై వెళ్లింది. లూర్దుస్వామి, ఎలిజబెత్‌లు ఇద్దరిని దుండగులు దారుణంగా హతమార్చి నిప్పంటించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఎస్పీ తంగదురై, ఐజీ సెంథిల్‌కుమార్, డీఐజీ ఉమలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన జరిగి వారం రోజులు కావడంతో సమగ్ర దర్యాప్తుకోసం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



హంతకుడి సీసీ టీవీ ఫుటేజీ

నకిలీ నోట్ల చలామణి కేసులో నలుగురి అరెస్ట్

● నిందితుల్లో ఒకరు ఏఎస్ఐ

రాయచూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా జిల్లాలో చర్చనీయాంశంగా మారిన నకిలీ నోట్ల చలామణికి సంబంధించి నలుగురు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని ఆశాపూర్ రోడ్డలోని ఒక ఇంట్లో నకిలీ నోట్లను చలామణి చేస్తున్న నిందితులు నోట్లతో సహ సోమవారం వెస్ట్ పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా సరిహద్దులోని గడి ప్రాంతంలోని గ్రామాలు, పెట్రోల్ బంకుల వద్ద నకిలీ నోట్లు పెద్ద ఎత్తున చలామణి జరుగుతున్నట్లు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య దృష్టికి వచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్పీ పుట్టమాదయ్య నిందితుల ఆచూకీ కనుగునేందుకు కట్టుదిట్టమైన ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. టీం సేకరించిన ఆధారాల మేరకు వెస్ట్ పోలీసులు నగరంలోని ఆశాపూర్ రోడ్డలోని నివశిస్తున్న ఒక నివాసగృహంపై దాడి చేయగా నలుగురు నిందితులు పట్టుబడ్డారు. నిందితుల్లో ఒకరు డీఏఆర్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ మరిలింగతో ఉండడం గమనార్హం. ఆయనతోపాటు మరో ముగ్గురు నిందితులు సద్దాం, సిద్దలింగప్ప, రవిలను పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రాథమిక విద్య.. బాలలకు బలమైన పునాది

●జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం

రాయచూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి జీవితంలో బాలలకు ప్రాథమిక విద్య బలమైన పునాది వంటిదని ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులకు నిబద్ధతతో మార్గనిర్దేశనం చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం సోమవారం నగరంలోని పండిత్ సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో ఏర్పాటు చేసిన ఒక రోజు సంకీర్ణ కార్యక్రమాన్ని జడ్పీ సీఈఓ ప్రారంబించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన విద్యార్థులు విద్యతో పాటు పాఠ్యేతర అంశాలైన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కళలు వంటివాటి పై అవగాహనం పంచుకోవడమేగాక తరచుగా వాటిలో భాగస్వామి కావాలన్నారు. తద్వార తమనుతాము బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దుకునేందుకు తగిన కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



నాటక ప్రదర్శనలో చిన్నారులు

ఇద్దరు రౌడీల దారుణ హత్య

అడయార్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం స్థానిక కోట్టూరుపురంలో ఆదివారం రాత్రి గుడిలో నిద్ర పోతున్న ఇద్దరు రౌడీలు దారుణ హత్యకు గురయ్యారు. ఈ జంట హత్య కేసుల వివరాలను పరిశీలిస్తే, కోట్టూరుపురం చిత్రా నగర్ యూ బ్లాక్‌కు చెందిన అరుణ్ (25) అనే వ్యక్తి రౌడీగా చెలామణి అవుతుండగా, అతడిపై వివిధ పోలీసుస్టేషన్లలో కేసులున్నాయి. ఆదివారం రాత్రి మరో రౌడీ సురేష్‌తో కలిసి మద్యం సేవించి, స్థానికంగా ఉండే ఒక గుడిలో నిద్రపోయాడు.. ఆ సమయంలో నాలుగు బైకుల్లో వచ్చిన ఎనిమిది మంది రౌడీలు నిద్రపోతున్న వారిపై వేటకొడవళ్లతో దాడి చేసి పారిపోయారు. ఆ దాడిలో సురేష్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, అరుణ్ ఆస్పత్రికి తరలిస్తుండగా తుదిశ్వాస విడిచాడు. ఈ జంట హత్యలపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టగా అరుణ్‌కు, అతడి పాత స్నేహితుడైన చిత్రా నగర్ వి బ్లాక్‌కు చెందిన సురేష్ అలియాస్ సుక్కుకాపీ సురేష్ (25)కు మధ్య ఉన్న పాతకక్షల నేపథ్యంలో ఈ హత్యలు జరిగాయని నిర్ధారించారు. అరుణ్‌ను హత్య చేయాలని సుక్కుకాపీ సురేష్ ప్లాన్ వేశాడు. కొంతకాలంగా అరుణ్ కదలికలను గమనించి, ఆదివారం రాత్రి అరుణ్, తన స్నేహితుడు రౌడీ సురేష్‌తో కలిసి ఒక గుడిలో నిద్రిస్తున్నట్లు తెలిసి. తన స్నేహితులతో కలిసి దాడి చేసి హత్యచేసి పారిపోయాడు. దీనిపై కోట్టూరుపురం పోలీసులు కేసు నమోదు చేసి, ఎనిమిది మంది నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ జంట హత్యలు స్థానికంగా కలకలం సృష్టించాయి.

కనీస వేతనం అమలు చేయాలి

●టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వీరేశ్

రాయచూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వీరేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని నిరశిస్తు టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన వీరేశ్, లేబర్ కోడ్లను ఏర్పాటు చేయడం వల్ల శ్రమదోపిడికి గురైయ్యే ప్రమాదం ఉందన్నారు. అన్ని వర్గాల కార్మికులకు 8 గంటల పని సమయాన్ని కేటాయించాలని సామాజిక భద్రత కల్పించాలని సమానపనికి సమాన వేతనం అందజేయాలని కనీస వేతనం ప్రతి రంగంలోని కార్మికులకు రూ.31వేలు అమలు చేయాలన్నారు. అదే సమయంలో కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలని వలస కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న టీయూసీఐ నేతలు